
# ఇలాగ ఎందరో...

ఇచ్ఛాపురపు రామచంద్రం



"సినిమా కెళ్దామా సీతా?" ప్రేమగా అడిగాడు సీతాపతి ఆమె కాపురానికి వొచ్చిన రెండో రోజున. కొత్త పెళ్లాన్ని సంతోష పెట్టాలని సీతాపతి తపన. స్త్రీ అంటే సినిమాకీ, చీరకీ మురిసిపోయే అల్ప సంతోషని అతని అంచనా.

అతని ప్రతిపాదన వింటూనే సీత త్రుళ్లి పడింది. ఒక్కసారామె కళ్లల్లోకి కన్నీళ్లూ, గుండెల్లోకి భయమూ, హృదయంలోకి గతమూ వొచ్చేసి — ఆమె నిలువునా వొణికింది. సీతాపతి కామె వైఖరేమీ అర్థంకాలేదు. సీత — అతని ముఖం చూడలేనట్లు కళ్లు మూసుకుంది. ఆమెలో గతం మెదలసాగింది.

* * *

వీధిలోంచి వొస్తూనే జానకిరామయ్య హడావిడిగా "సీతా!..." అంటూ కేక వేశారా సాయంత్రం.

"ఏం నాన్నా?" చదువుతున్న పుస్తకం మూసి వొచ్చింది.

"మీ అమ్మని పిలుచుకురా. అర్జంటుగా ఓ మాట చెప్పాలి."

సీత కంగారుగా తల్లిని పిలుచుకు వొచ్చింది.

"మనం అర్జంటుగా సినిమాకెళ్లాలి." అన్నారాయన అక్కడికా సినిమా చూడకపోతే కొంపలు మునిగిపోతాయన్నట్లు. జనకుడికున్నట్లే ఈయనకీ వేపకాయంత వెర్రుంది. (జనకుడికి వెర్రికాకపోతే — పిల్ల నచ్చినవాడల్లుడనక విల్లు విరిచినవాడే అల్లుడనడమేమిటి?) వృద్ధుల బుద్ధులు సంచలించవే అన్నది నిజం చేయడానికి కాకపోతే గోడమీద రాతలు చదివి ఈ జానకి రామయ్యగారు పెళ్లాన్నీ, పిల్లనీ ఉన్నపళాన సినిమాకి బయలుదేరమని కచ్చలో కందులు వేపడమేమిటి?

"చదువుకోవాలి నాన్నా. రేపు పరీక్ష ఉంది." బతిమాలింది సీత కన్నీళ్లతో. సీత — కాలేజీలో ఇంటర్ చదువుతూంది. అది — చాలా మంది అమ్మాయిల చదువులా పెళ్లి చదువూ వానాకాలం చదువూకాదు. ఫ్యాషన్ చదువూ కాదు. మెడిసిన్ చదువు. సీత శ్రద్ధగా పట్టుదలగా చదువుతుంది. ఆమె క్లాసులో మరెవరూ ఫస్ట్ మార్కుల మీద ఆశ పెట్టుకోవడం మానేశారు. ఫస్ట్ రాంక్ సీత గుత్తకి తీసేసుకుంది.

సీత కెప్పుడూ ఒకే కల వొస్తూంటుంది. కలలో ఆమె డాక్టర్ సీతాదేవై పోతుంది. ప్రజా సేవ చేసేస్తూ ఉంటుంది. శ్రీవారూ డాక్టరే. వారిది అన్యోన్యదాంపత్యమూ. ఆదర్శ జంటా. ఆ కలని నిజం చేసుకుందుకు సీత నిరంతరమూ శాయశక్తులా కష్టపడి చదువుతూంటుంది. ఆ కల ఆమె ప్రాణం... జీవితం... సర్వస్వం... సీతంటే ఒక్కముక్కలో ఆమె కల. అందుకే — "చదువుకోవాలి నాన్నా!" అని వేడుకుంది.

"చదువు రేపుంటుంది. సినిమా ఉండదు." అని సత్యం చెప్పారు జానకిరామయ్య, యింక మాట్లాడకన్నట్లు.

"వంట — సగంలో ఉందండీ!......" ప్రార్థించిందన్నపూర్ణ.

"మిగిలిన సగమూ సినిమా నుంచొచ్చాక చేద్దువుగానిలే." అని యిల్లాలినీ నోరు మూయించేసి సినిమాకి బయలుదేరదీశారు. వాళ్లాయన మొండితనం తెలిసిన వారవడంచేత ఆట్టే ప్రతిఘటించకుండానే లొంగిపోయారు.

వాళ్లు థియేటర్ చేరుకునేసరికి షో యింకా మొదలు కాలేదు.

సీత బాగుంటుంది. ఈ పద్దెనిమిదీ నిండితే యింకా బాగుంటుంది. వాలు జడలో పూలు తురుముకుని...కళ్లకి కాటుక పెట్టుకున్న సీత— సినిమా కొచ్చిన బాపూ బొమ్మలాగే ఉంది.

ఈ రోజుల్లో బెల్లానికి చీమలు పట్టడం మరచిపోవచ్చునేమో కాని అమ్మాయిలకి... అందమైన సీత లాంటి అమ్మాయికి ఈవ్ టీజర్స్

పట్టడం మరచిపోరు కదా ? ఆ రోమియో — సరిగ్గా సీత వెనక సీటులోనే తగలడ్డాడు. దానితో— తెరమీద సినిమా కంటే సీత కష్టాలే ముందుగా మొదలయ్యాయి.

సీతకి లోకజ్ఞానం ఉంది. రోజూ కాలేజికి నడిచివెళ్లి నడచి వొస్తుంది కనుక ఋూవ్‌టీజర్స్ సంగతి కొత్తకాదు. నలుగురిలోనూ అల్లరి ఎడడంవల్ల ఎవరి కెక్కువ నష్టమో తెలిసింది కావడంవల్ల — రోమియో అల్లరి కొంత భరించాక— "పేరెంట్స్‌తో వొచ్చాను...ప్లీజ్..." అని వెనక్కి తిరిగి వేడుకుంది పరిస్థితి అర్థం చేసుకుని తనని వదిలి పెట్టమన్నట్లు.

ఆ రోమియో సీత అసహాయ పరిస్థితి నర్థం చేసుకుని— మరీ విజృంభించేడు. అదృష్టం పండిందనుకుంటూ — సీత జడని తన వొడిలోకి లాగేసుకున్నాడు. దొరికిన చోటల్లా సీత శరీరాన్ని వేళ్లతో పొడిచాడు. ఆమె జడలో పూలన్నీ వొలిచేసి తన జేబులో వేసుకున్నాడు. సీత— ఉండుండీ — "ప్లీజ్..." అంటూనే ఉంది.

తిక్కమనిషయిన తండ్రి గురించి భయపడుతూ — ఆమె — ఆ రోమియో హింసనీ! అమానుషత్వాన్ని ఎలాగో ఇంటర్‌వెల్‌వరకూ ఓపిగ్గా భరించింది. ఇంటర్వెల్‌లో తల్లితండ్రులతో తనూ బయటకి వెళ్లివొస్తూ — సీటు మారాలని ప్రయత్నించింది. కాని — అప్పటికే సీత సీటుమీద సిగరెట్‌పెట్టె... దానిమీద ప్రేమ మార్కు ఆటీనూ, అందులో బాణంబొమ్మా... కింద — ఐ లవ్ యు... సిగరెట్‌పెట్టె చుట్టూ పూలతో అలంకారం. అది — ఎవరికంట పడకూడదని సీత వెయ్యి దేముళ్లకి మొక్కుకుందో వారికంటనే పడింది !

"చాలు... చూసింది చాలు... సినిమా లేదు, గినిమాలేదు, ఇంటికి పదండి." తీర్మానించేశారు జానకిరామయ్య. వొట్టి తిక్కమనిషని విసుక్కుంటూ భర్త ననుసరించిందన్నపూర్ణ. భయపడుతూ... గుండెలుగ్గబట్టుకుని తండ్రి వెనుక అడుగులు వేయసాగింది సీత.

ఇల్లు చేరగానే— గుమ్మంలోనే నిలదీశారు జానకిరామయ్య.

"ఎవడు వాడు ?"

"నాకు తెలియదు." తల వొంచుకుంది సీత.

"నీకూ వాడికీ ఏమిటి సంబంధం ?" గద్దించారు.

గజగజ వొణికిపోయింది సీత. ఆ క్షణంలో ఆయన ఆమెకు కన్నతండ్రిలాకాక కఠినాత్ముడిలా కనిపించాడు. తండ్రయితే అలాగ మాట్లాడతాడా ?

"ఎన్నాళ్లనుంచి సాగుతోందీ భాగోతం ?" అరిచారాయన.

బాధగా... భయంగా...ఏదో చెప్పబోయింది సీత. కాని ఆమె గొంతు పెగలలేదు.

"నంగనాచిలా నోరు తెరవ్వేం ? నేను చూడలేదనుకున్నావా నువ్వు చీటికీ మాటికి వెనక్కి తిరిగి ఆ దౌర్భాగ్యుడితో గుసగుసలాడడం ?" నిలదీశారు.

"నిజంగా నాకేమీ తెలియదు. ఆడపిల్ల బయటకు వొస్తే యిలాగే వేధిస్తారు. దానికి— తెలిసి ఉండనక్కర్లేదు" అంది ఎలాగో.

"మరి నా కక్కడే ఎందుకు చెప్పలేదు ?"

"అనవసరంగా నలుగురిలోనూ గొడవౌతుందని ..."

"కాదు. మీ ఇద్దరి మధ్యా ఇదివరకే..."

"నాన్నా! నేనలాటిదాన్ని కాను నాన్నా" భోరుమని ఏడ్చింది.

సీత మాట లాయన నమ్మలేదు. మన బంగారం మంచిది కాదనీ, 'కంసాలిని తప్పు పట్టడం అనవసరమనీ తీర్పిచ్చేసిన తండ్రికి — అమ్మ కూడా వంతపాడడం సీతకి మతిపోగొట్టేసింది. నిస్సహాయంగా ఏడ్వడం కంటే ఏమీ చేయలేని పరిస్థితిలో మిగిలిపోయింది సీత.

"రేపట్నుంచి గుమ్మం కదిలావంటే కాళ్లిరగ్గొట్తాను ..."

"నా చదువు ..."

"చదువూ లేదు, చట్టుబండలూ లేదు. చేసిన నిర్వాకం చాలు ..."

సీత — దుఃఖం ఆపుకోలేక — బిగ్గరగా ఏడ్చింది.

ఇష్టంలేనివి తొందరగా జరిగిపోతాయేమో! సీత ఏడుస్తున్నా వినకుండా ఆమెను చదువు మానిపించేశారు. ఏడుస్తున్నా వినకుండా — ఆలస్యమైతే పెళ్లే కాదేమో జీవితంలో అన్నట్లు —తొందరలో ఓ తలమాసిన సంబంధం చూసి సీతకి పెళ్లి చేసేశారు. అత్తారింటికి పంపేశారు అర్జంటుగా.

సీత చెయ్యని తప్పుకి — ఆమె చదువాగిపోయింది. సీత చేయని నేరానికి — ఆమె కలలు సమూలంగా కూలిపోయాయి. సీత చెయ్యని అపరాధానికి — ఆమె ఆశలు నాశనమయ్యాయి.

సీత దృష్టిలో—ఆమె జీవితం యింకలేదు. డాక్టరూ, డాక్టరు భార్య కావలసినది — వొట్టి యిల్లాలూ, బడిపంతులి భార్యా కావడంతోనే — సీత కింకేమీ మిగలలేదనిపించింది. తన జీవితం యిలా చిన్నాభిన్నం కావడానికి, తన అదృష్టం యిలా వక్రించడానికి, తన కలలు కరిగిపోడానికి... తన ఆశలు నాశనమవడానికి కారణం — ఓ రోమియో...ఋూవ్ టీజర్ ... మూర్ఖుడు ... వాళ్లు విశృంఖలంగా విహరించగల్గుతున్న యీ దౌర్భాగ్య వ్యవస్థ !

* * *

"ఏం సీతా, సినిమా కెళ్దామా ?" మళ్లీ అడిగాడు సీతాపతి. ఏదో లోకంలోంచి మాట్లాడుతున్నట్లు బలహీనంగా ...

ఆ సినిమాలో ఋూవ్ టీజరు తన భవిష్యత్తుని కూల్రదోసినట్లు యీ సినిమాలో మరో రోమియో తన కాపురాన్నే కూల్రదోస్తాడేమో అని భయపడుతున్నట్లు — మెల్లగా ... "సినిమాకా ! ... అరవైదాటి ... ఆడతనం పూర్తిగా మరుగున పడ్డాక...అప్పుడు ... అంతవరకూ...క్షమించండి... నేను సినిమాకి రాలేను. రాను." అంది.

సీతాపతి అయోమయంగా చూశాడామె మాటలర్థంకానట్లు..

గడపదాటిన స్త్రీ — మానభంగానికో, అభిమాన భంగానికో గురికావడమనేది సాధారణమైపోయిన యీ రోమియో వ్యవస్థ అర్థమైనవారికి తప్ప, సీత మాటలూ వాటిలోని ఆవేదనా ఎవరికి అర్థమౌతుంది? ★

